

కథా కౌముది

# ముసుగు – అవసరాల రామకృష్ణారావు

*తెలుగు కథ శతవార్షికోత్సవాల సందర్భంగా వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన కథల పోటీలో బహుమతి పొందిన కథ*

నేనవి బిమల్ బాలా విమెన్స్ కాలేజ్‌లో ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్న రోజులు. ఆ రోజు నాకంతగా గుర్తుండిపోడానికి ముఖ్యకారణమే ఉంది. పది గంటలయినా తొలగని చలి ముసుగు కాదు, నేను ఇంచుమించు చిక్కుపడి పోయిన లోపలి ముసుగు.

అప్పటి స్పెషల్ సెకండరీ ఎగ్జామ్స్‌కి ఛీఫ్ సూపరింటెండెంట్‌గా వ్యవహరించే బాధ్యత సహజంగా నా మీదనే పడింది. ఆనాటి పరీక్షల్లో ఇన్విజిలేటరుగా నేను నియమించిన పొలిటికల్ సైన్సు లెక్చరరు బిష్ణుప్రియా మొహంతే ఇంకా రాలేదు! కాలేజీ ఆవరణని ఆనుకుని ఉన్న స్టాఫ్ క్వార్టర్సులోనే ఆమె బస! వెళ్ళి వెంటబెట్టుకు రమ్మని హెడ్ ప్యూన్ మహేశ్వర్ పాత్రోని పరిగెత్తించాను. అంత వేగంగానూ పాత్రో తిరిగొచ్చాడు. ఆమె ఇంట్లోనే ఉందిట! లోపలెక్కడో లైటు కూడా వెలుగుతోందిట. కాలింగ్ బెల్ నొక్కినా తలుపు తియ్యదట! ఈ నిర్లక్ష్యానికి ఒళ్ళు మండిపోయింది. అదృష్టవశాత్తూ ఆవిడ బదులు మరో లెక్చరరు దొరికింది. అప్పటికప్పుడు ఆవిణ్ణి ఎపాయింట్ చేసి ఎగ్జామ్ హాల్లోకి పంపేసరికి అంత చలిలోనూ చెమటలు పట్టేశాయి నాకు.

ఎంతటి గడ్డు శీతాకాలమైనా మనవైపు ఎనిమిది గంటలకైనా తెల్లారుతుంది. ఒరిస్సాలోని ఈ మన్యపు ప్రాంతంలో పది గంటలయినా లైట్లు వేసుకుని పనిచేసుకోవాలి! అయినా ఆ రోజుల్లోనే ఇలాంటి ప్రాంతంలో రెండు గవర్నమెంటు కాలేజీలు ఉండడం ఎంతటి ముందడుగు! ఆ చివర మెన్స్ కాలేజ్, ఈ చివర నేను పనిచేస్తున్న విమెన్స్ కాలేజీ! ఈ కాలేజీలో అంతా ఆడ స్టాఫ్ ఉండాలనే రూలు లేదని నన్నిక్కడ ఎపాయింట్ చేసిన రోజునే తెలిసింది. ఇంగ్లీషు ప్రొఫెసరుగా ఇన్నేళ్ళూ ఈ అన్య రాష్ట్రం అంతా తిరిగినా పెద్దగా ఒరియా రాకపోవడం నన్ను అంతగా బాధించలేదు. ఎడ్మినిస్ట్రేటివ్ హెడ్‌గా ఇక్కడికొచ్చాక ఎలాంటి ఇబ్బంది ఎదుర్కోవాలో అనుకున్నాను కాని అదేం లేకపోవడం నా అదృష్టం. నేను సంతకాలు చేసే అన్ని నోటీసులూ, ఆర్డర్లూ ఇంగ్లీషులోనే ఉన్నాయి. బాగా ఇంగ్లీషు రాకపోయినా చాలామంది లెక్చరర్లు నేను మాటాడింది అర్థం చేసుకోగలరు. హెడక్లర్క్ బిభూత్ దాస్‌ది పర్లాకిమిడి గనక తెలుగు బాగా మాటాడగలడు కూడా.

అతన్ని పిలిపించి బిష్ణుప్రియ శాసన దిక్కారానికి ఎలాంటి ప్రతిచర్య తీసుకోవాలో సంప్రతించాను. అతను అన్నదిదీ.

'మీ మంచితనాన్ని తక్కువగా కట్టి బిష్ణూ ఎలా పడితే అలా ఆడుతోంది సార్! రెండేళ్ళ పిల్లతో ఉందనీ, జబ్బుతో ఉన్న ముసలి తండ్రికి తను తప్ప మరో సాయంలేదనీ ఎంతో దొడ్డ బుద్ధితో రికమెండ్ చేసి మీరే ఆమెకా క్వార్టర్సు వచ్చేలా చేశారు. ఏమైనా కృతజ్ఞత

ఉందా! పైగా తన డ్యూటీ తను సరిగ్గా చెయ్యక, పై రాష్ట్రం వారని మిమ్మల్ని ఇరుకున పెడుతుందా? ఇలాంటి ఇన్ సబార్డినేషన్‌కి ఇప్పటికైనా మీరు తగిన యాక్షన్ తీసుకోకపోతే ఇక కాలేజీలో డిసిప్లిన్ అనేది నిలుస్తుందా?'

'ఆమె తండ్రికి జబెక్కువైపోయిందేమో!?'

'జబ్బెక్కువైపోయిన మాట నిజమే, కాని తండ్రికి అయి ఉండదు!'

'మరి?'

'పెద్దవారోయ్, మీలాంటి వారి చెవిన ఇలాంటి భోగట్టాలు వెయ్యడం బాగుండదు. కాని తప్పదు కద!' అంటూ రహస్యంగా భిబూత్ నాకు చెప్పిన విషయం విని తెల్లబోయాను.

ఆ ఊళ్ళోనే మెన్స్ కాలేజీలో పనిచేసే రాధా నాథ్ ఆవిడ మొగుడనే సంగతి అందరితోపాటు నాకు తెలుసు. తెలియందేమిటంటే అతనక్కడేం ఉద్యోగం వెలిగిస్తున్నాడో గాని, తరచూ, ఇక్కడే అఘోరిస్తూ ఉంటాడట. భిభూత్ కాలేజీకి వాళ్ళ క్వార్టర్స్ దాటే రావాలట.

'నేనిలా వచ్చేటప్పుడు పొరపాటున వాళ్ళ క్వార్టర్సు గాజు కిటికీలోంచి చూశానా, సిగ్గుతో ప్రాణాలు పోతాయనుకోండి'

అదేమిటని నేనడక్కుండానే అతనిలా చెప్పాడు:

'ఏముందు! దారుణమైన చలికాలం. పొగమంచు. ముసుగు ఇంకా విడిపోదు కదా! నీటి తుంపర్లతో అలుక్కుపోయిన ఆ గాజుపలకలోంచి ఆ దృశ్యం తలుచుకుంటేనే అసహ్యం వేస్తుంది. ఇంత మందమున్న రగ్గు కప్పుకుని ఏక మంచం మీద దొర్లుతూ ఉంటారు. డ్యూటీ ఉందనే స్పృహ ఉండడానికైనా, కాలింగ్ బెల్ వినపడ్డానికైనా, వాళ్ళు మనలోకంలో ఉంటే కదా!'

భిభూత్ తర్వాత ఏం చెబుతూ వచ్చాడో గాని, 'వాళ్ళు మన లోకంలో ఉంటే కదా!' అనే మాట దగ్గర నా మనసు ముద్రపడి, అలా నన్ను వెనక్కి వెనక్కి లాక్కుపోయి, ఆ దృశ్యాన్ని కళ్ళముందు నిలబెట్టింది.

అవి మా ఆవిడ కొత్తకాపురానికి వచ్చిన రోజులు. పక్క గదిలో ఏకశయ్యలోని వెచ్చదనం మేం అనుభవిస్తున్న సమయంలో మా అమ్మ గావుకేక!

'ఇంత పొద్దెక్కినా ఇంకా లేచి ఇవతల పడవేమే, కోడలమ్మ తల్లీ! పాలు పొయ్యి మీద పెట్టేను. నేను నీళ్ళ గదికి వెడుతున్నాను లేచి దింపుకో'

చెప్పకేం, ఇందులో మా ఆవిడ తప్పేం లేదు. నేను మళ్ళీ మళ్ళీ దాన్ని కమ్మని కౌగిట్లోకిలాక్కున్నాను. పాలు పొంగిపోయి బుగ్గిపాలయిపోయాయి.

తిరిగి వచ్చిన మా అమ్మ ఆ వీధి వీధంతటినీ పిలిచి ఎంత డర్టీ సీన్ క్రియేట్ చేసిందో నేనెలా మరచిపోగలను! అపుడావిడ అన్నమాట సరిగా ఇదే!

'వాళ్ళు మనలోకంలో ఉంటేకదా!'

పోనీ అక్కడితో ఊరుకుందా

'మగాడు, వాడికి లేకపోతే పోయింది, దీనికైనా ఉండొద్దుటమ్మా బుద్ధి? అవ్వ! ఆడదానికి మరీ ఇంత కావరమా!'

'ఏమిటిసార్, నేన్చెప్తున్నదేదో మీరు వింటున్నట్టు లేదే!'

'ఆఁ ఆఁ అదే అదే ఏదో జ్ఞాపకం వస్తేనూ..'

అంటూ మళ్ళీ ఈ లోకంలోకి వచ్చి టైము చూస్తే పదిన్నర! భిభూత్ కొనసాగించాడిలా:

'ఓ గవర్నమెంటు కాలేజీలో తల అమ్ముకున్న ఉద్యోగిని ఎంత బరితెగించింది కాకపోతే, కబురు పెట్టినా ఇంత నిష్పూచిగా ఊరుకుంటుందా! మీరింకా ఇంత కామ్‌గా ఎలా ఉండగలుగుతున్నారో నాకు అర్థంకావడం లేదు సార్!'

'సరే పదకొండు దాకా చూద్దాం. ఈలోగా నువ్వు మెమో తయారుచేసి తీసుకురా. అప్పటికీ రాకపోతే తాఖీదు పంపించేద్దాం' అన్నాను.

బిష్ణూ అప్పటికీ రాలేదు.

ఒరిజినల్ కాక మరో మూడు కాపీలు తయారు చేసి భిబూత్ తీసుకువచ్చాడు. ఇంగ్లీషులో ఉన్న దాని సారాంశం ఇదీ:

"మీకివాళ ఇన్విజిలేషన్ డ్యూటీ ఉందని నిన్నటి సంతకం గల కాగితం కాపీ ఇందులో జోడించడమైనది. మీరు హాజరు కాలేదు. హెడ్ ప్యూన్ మహేశ్వర్ పాత్రోని మీ బి - 8 క్వార్టర్‌కి పంపించాను. కాలింగ్ బెల్ మ్రోగించినా మీ నుంచి ఎట్టి సమాధానమూ లేదు. ఇలా జరిగిందనే అతని స్టేట్‌మెంట్ కాపీ కూడా దీనితో జతపర్చడమైనది. మీరు హాజరు కాలేదు. హెడ్ ప్యూన్ మహేశ్వర్ పాత్రోని మీ బి - 8 క్వార్టర్‌కి పంపించాను. కాలింగ్ బెల్ మ్రోగించినా మీ నుంచి ఎట్టి సమాధానమూ లేదు. ఇలా జరిగిందనే అతని స్టేట్‌మెంట్ కాపీ కూడా జతపర్చడమైనది. మీ గైర్ హాజరీని మీ నిర్లక్ష్యధోరణి మిమ్మల్ని రెట్టింపు అపరాధినిగా నిలబెడుతోంది. మీమీద ఎందుకు క్రమశిక్షణ తీసుకోకూడదో తక్షణం తెలియజేయవలసింది."

హెడ్ క్లర్క్ దాసు మరో పని కూడా చేశాడు. నా రూంలో ఓ పక్కకి నిలబెట్టి ఉన్న గాడ్రెజ్ బీరువా తెరిచాడు, నా దగ్గరున్న తాళాల గుత్తి తీసుకుని, లోపలి లాకర్‌లో ఉన్న లెక్చరర్ల సర్వీస్ రిజిష్టర్ల కట్ట ఇవతలకి లాగాడు. దాన్లోంచి బిష్ణూ ప్రియ మొహంతీ రిజిష్టరు వేరుచేసి నా బల్లమీదపెట్టాడు. మిగిలినవన్నీ యధాస్థానంలో పెట్టి లాక్ చేసి నా తాళాల గుత్తి నాకిచ్చేశాడు. ఇచ్చేస్తూ అన్నాడిలా: ' పని పూర్తిచేయించుకు వస్తాను. మనం ఇలా ఊరుకుంటే లాభం లేదు. ఆమె జవాబూ, మీ రిమార్క్సూ కలిపి ఆమె సర్వీస్ బుక్‌లో పుటప్ చేద్దాం. స్పెషల్ మెసెంజరుతో దాన్ని భువనేశ్వర్‌లోని హయ్యర్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్‌కి పంపుదాం. తగిన డిసిప్లనరీ యాక్షన్ వారే తీసుకుంటారు. ఎక్కణ్ణుంచీ వచ్చినా మీకెందుకీ నింద! ఒళ్ళు తెలియని కావరంతో భవిష్యత్తుని తనే నాశనం చేసుకుంటూంటే మీరేం చెయ్యగలరు మధ్య?'

అన్ని కాపీల మీదా నా సంతకమూ, ఆఫీసు ముద్రా పడ్డాక ఓ కాపీ తీసుకుని మహేశ్వర్ అక్కణ్ణుంచి కదిలాడు. ఇన్విజిలేషన్ రికార్డేదో టైపు చెయ్యడానికి భిబూత్ నా రూంలోంచి వెళ్ళిపోయాడు.

యాంత్రికంగా భిభూత్ చెప్పిన చోట సంతకాలు పెట్టేశాను గాని, నేను చేసిన పని నాకే బాగోలేదనిపించింది. బిష్ణూ మా ఆఖరమ్మాయ్ ఈడుది. పొరపాటే చేసిందనుకుందాం. దానికింత కఠిన శిక్షా! నడిచి వెళ్ళే దూరంలో ఉంది. ఇంటికెళ్ళి 'ఇదేమైనా బాగుందా' అని అడగడానికి నా హోదా అడ్డొచ్చిందా? అయినా చేసిన పొరపాటు అనగా ఎంతటిది? ఇంకా చలి తెర పూర్తిగా తొలగని సమయంలో పడుచువాళ్ళు మరి కాస్సేపు మైమరచి పడుకుంటే అదో అపరాధమా! హెడ్ క్లర్క్ నామీదేదో ముసుగులాంటిది వేశాడేమో అనిపించింది. అయినా నేనేం బలవంతాన వేయించుకోలేదు కదా! ఆనాడు మా అమ్మ చేసిన అవమానానికి మా ఆవిడ ఏళ్ళ తరబడి గాయపడింది. అప్పుడూ మా అమ్మని నేను ఎదురించలేకపోయాను. ఇప్పుడూ ఎవడో పురెక్కిస్తే తొందరపడి పోవాలా నేను?

ముసుగు తొలగించుకునేలోగా నేను అడ్డుకోవాలి. ఎలాంటి కాగితాలయినా హృదయాలని విప్పి చెప్పలేవు. కాలింగ్ బెల్ నొక్కే ప్రయత్నంలో వేళ్ళటు వెళ్ళాయి. కాని నాకా అవకాశం లభించలేదు.

'మై ఐ కమిన్ సార్?' అంటూ బిష్ణూ మొహంతీ లోపలికి రానే వచ్చింది. వందమంది స్టూడెంట్సుకి గంటసేపు నిలబడి కంచు కంఠంతో పాఠాలు చెప్పే పొలిటిక్స్ మేడమ్ గానే బిష్ణూని నేను ఎరుగుదును. అన్నీ కోల్పోయినట్టున్న ఈ నిస్సహాయత స్థితి ఏమిటి?

ఇరవై నాలుగంటలూ ఇంట్లో ఓ ఆయా ఉంటుందని విన్నాను. 'ఎట్టి పరిస్థితిల్లోనూ నిన్ను విడిచేదిలేదు' అంటూ తల్లిని చుట్టుబెట్టుకుపోయిన కూతుర్ని ఎత్తుకుని ఏకంగా ప్రిన్స్‌పాల్ రూంకే రావడమేమిటి?

పిల్లనెత్తుకుని నిలబడే ఉన్న ఆమెని బలవంతాన కూచోపెట్టాను. తాగడానికి మంచినీళ్ళిచ్చాను. ప్యూన్‌ని పిలిచి కొంతసేపు ఎవర్నీ లోపలకి రావద్దని ఆర్డరు పాస్ చెయ్యడం మంచికే అయిందని తర్వాత తెలిసింది. నేను పంపిన కాగితాలు బల్లమీద పెట్టింది. ఆమె పూర్తిగా స్థిమితపడ్డాక చెప్పిన విషయాలు ఒకటి ఒకటీ చెవిన పడుతూంటే ముసుగు తెరలు ఒకొక్కటి తొలిగిపోయినట్లైంది.

బిభూత్ దాస్ ఇంత ఇంట్రెస్టు చూపించడానికో ముఖ్యకారణం ఉందట. అతని మేనకోడల్ని ఈ కాలేజ్‌కి బదిలీ చేయించుకుందామని ఎప్పట్నుంచో చూస్తున్నాడట. బిష్ణు ట్రాన్స్‌ఫరై ఖాళీ ఏర్పడితే తప్ప, ఎందుకంటే ఇక్కడి పొలిటికల్ సైన్సు లెక్చరర్ పోస్టు ఒక్కటే కదా, ఆ అమ్మాయి ఇక్కడికి రావడం అవదట.

ఆ అమ్మాయి చెప్పింది కరెక్టో కాదో వెరిఫై చేసుకోడానికి నా సోర్సెస్ నాకున్నాయి. తర్వాత చూస్తాను - అని మనసులో అనుకుని పైకి మాత్రం ఇలా నిలదీశాను:

'నీ పొరపాటుకి ఇది దిద్దుబాటు కాదు. నువ్వో గవర్నమెంటు ఇన్విజిలేషన్ చార్టు మీద సంతకం చేశావు. పది గంటల వేళ ముసుగు తన్ని కులుకుతున్నావుట. ఏమిటి నీ సంజాయిషీ?'

బిష్ణుప్రియ చెప్పింది విని మతిపోయింది నాకు.

గాజు కిటికీ దగ్గర కప్పుకు పడుకునేది పక్షవాతంతో బాధపడుతున్న ఆమె తండ్రట. ఇంతకీ ఒకే ఊళ్ళో ఉన్నా ఆమె భర్త రాధానాదో వాళ్ళ క్వార్టరుకి వచ్చి వారం దాటిందట.

'తండ్రిలాంటివారు. మీతో ఏదైనా చెప్పుకోవచ్చు' అంటూ బిష్ణు మరిన్ని సంగతులు చెప్పింది.

తండ్రికి ఒక్కర్తే సంతానం ఆమె. సామాన్య కుటుంబానికి చెందినా ఇల్లూ పొలమూ అమ్మి బిష్ణుని చదివించి ఇంతటి దాన్ని చేసింది ఆయనే. తమ కులం కాని రాధాని పెళ్ళాడ్డం ఆయనకెంత మాత్రం ఇష్టంలేదు. అయినా అలా జరిగిందని వినగానే స్ట్రోక్ వచ్చిందాయనకి. తన కూడా ఉండడానికి ఓ పట్టాన ఒప్పుకోలేదు. రాధా మంచితనం క్రమక్రమంగా అర్థమై ఇప్పుడిప్పుడు సర్దుకుంటున్నారట.

ఓ పక్క గుండె తడి అవుతున్నా లేచి నిబ్బరం తెచ్చుకుని అడిగాను.

'ఇవన్నీ పర్సనల్ ప్రోబ్లెమ్స్. ప్యూన్ వచ్చి బెల్ కొట్టినా తలుపు తీయవు. పరీక్ష ఉందని తెలిసి కూడా పదకొండైనా ఖాతరు చెయ్యవు. ఏమిటి నీ జవాబు?"

'పొరపాటే. క్షమించమని అడగటానికే వచ్చాను. తొమ్మిది నుంచి తయారవాలనే చూశాను. రోజూ వచ్చే ఆయాకి జ్వరంట. రానని కబురు పెట్టింది. దీనికి వాంతులు, విరోచనాలు, గట్టిగా నన్ను హత్తుకుని చంక దిగుతేనా? నాన్నకి బాధ ఎక్కువైపోయి ఒకటే మూలుగు. ఆ సందులో కాలింగ్ బెల్ వినపడినా వెళ్ళి తలుపు తియ్యలేకపోయిన మాట నిజమే. దీన్ని పెరట్లోకి తీసికెళ్ళి శుభ్రం చేసేసరికే నా నడుం విరిగినంత పనైంది. రాధకి ఫోన్ చేస్తే అక్కడా గవర్నమెంటు ఎగ్జామ్స్ జరుగుతున్నాయి కదా, అందులో అతను సీనియర్ ఇన్విజిలేటరు కూడా కదలడానికి కుదరదని చెప్పాను..'

ఇంకెవరూ ఏమీ చెప్పనక్కరలేదు. విషయం తేటతెల్లమయ్యాక ఇక చేపట్టవలసింది చర్యే పరీక్ష పూర్తవడానికి ఇక గంట టైముందని వాల్ క్లాక్ చెబుతోంది. ఆ వేళకి ఇన్విజిలేటర్లందరూ పేపరు కట్టలు పట్టుకుని వచ్చేది ఇక్కడికే.

మొదటి పనిగా బిష్ణు సర్వీస్ రిజిస్టరు ఎప్పట్లా గాడ్రేజ్ బీరువా లాకర్లో పెట్టేశాను. ఆమె అందుకుని సంతకం పెట్టకుండా తెచ్చి ఇచ్చిన ఛార్జిషీటు, దాని కాపీలు టేబిలు పైన ఉంచాను. అన్నీ కలిపి ఇంతింత ముక్కలుగా చేసి డస్ట్‌బిన్‌లో పడేశాను.

'ఇంకెప్పుడూ ఇలాంటి పరిస్థితులు రానివ్వకు బేటా!'అన్నాను ఆమె తల మీద చెయ్యివేసి. కుర్రదాన్ని కూడా అలా తలనిమురుదామని చూశానుగాని లొంగింది కాదు, భడవ. మరింతగా వాళ్ళమ్మను కరుచుకుపోయింది.

పిల్లతో సహా బిష్ణుప్రియ మొహంలో నా కాళ్ళని కన్నీళ్ళతో కడిగింది. అలా వంగినపుడు, ఆ పిల్ల గౌను జేబులో ఎప్పుడూ ఉంచుకునే వాళ్ళ నాన్న రాధానాధొ మొహంతే ఫోటోలు, బయట పడిపోయింది. తిరిగి దాన్ని జేబులో పెట్టేదాకా ఆ గుంట నిప్పెట్టేసింది!

వాళ్ళు వెళ్ళిపోయినా ఆ దృశ్యం నన్ను వదల్లేదు.

తల్లీ తండ్రీ పిల్లా అనేది ఓ కమ్మని కలయిక. మానవ బంధం ఇన్నేళ్ళ పాటు నిలబడిందంటే దీని వల్లనే. నేటి సమాజం పరిస్థితి వారి అనురాగ బంధాన్ని అనేక విధాల సవాలు చేస్తోంది. వాళ్ళలో వాళ్ళే విడిపోతే వేరే విషయం. వాళ్ళని వేరు చెయ్యడానికి పరాయివాణ్ణి నేనెవణ్ణి!

ఆ క్షణమే భువనేశ్వర్ లోని ఎడ్యుకేషన్ డిపార్ట్ మెంట్‌లో నాకు తెలిసిన ఓ పలుకుబడిగల ఫ్రెండుకి ఫోన్ చేశాను. రాధానాధ్ మొహంతీని మెన్స్ కాలేజీ నుంచి విమెన్స్ కాలేజీకి ట్రాన్స్‌ఫర్ అయ్యే అవకాశం కోసం ప్రయత్నించమని.

ఓ మంచి పని చేసిన తృప్తితో నా ఒళ్ళు గగుర్పొడిచింది.

ఇంకెక్కడి చలి ముసుగు? కిటికీలోంచి వచ్చిన సూర్యకిరణాలు మెచ్చుకుంటున్నట్టు నన్ను వెచ్చగా తాకాయి.

●●●

Click here to share your comments on this story